క్లుప్తంగా

నియామకం



రవియాదవ్
మండల అధ్యక్షుడు

వేలేరు : భూమాత రైతు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా పీచర గ్రామానికి చెందిన జల్తారి రవియాదవ్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సంపత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. భూ మాత రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో నియమించిన సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధిహామీ చట్టాన్ని పరిరక్షించాలి



రాజును సన్మానిస్తున్న బాధ్యులు

ఆత్మకూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్ అన్నారు. సోమవారం హనుమకొండలో ఏఐసీసీ సభ్యుడు కొప్పుల రాజును డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణతో కలిసి ఉపాధిహామీ కూలీల సమస్యలను ఆయన వివరించారు. కూలీల సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని సురేష్ కోరారు. అనంతరం కొప్పుల రాజును సురేష్, రామకృష్ణ తదితరులు సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● ఎంఈఓ రాము

సంగెం : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ రాము స్పష్టం చేశారు. మండలంలోని ఎల్గూర్ స్టేషన్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎల్గూర్ స్టేషన్, జాటోత్ తండాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు ఉపాధ్యాయులతో కలిసి ఆయన వెళ్లి బడిబాటపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న సౌకర్యాలను వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని కోరారు. హెచ్ఎం దేవేందర్‌రావు, ఉపాధ్యాయులు కుమారస్వామి, ఏకాంబరం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ అనిత, సీఆర్పీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● ఐసీడీఎస్ సీడీపీఓ డెబోరా

గీసుకొండ : పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ డెబోరా అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని గంగదేవిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణుల నమోదు, బరువు, ఎత్తు కొలిచి పోషకాహారం తీసుకునే విషయమై వివరించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాధవి, సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు మేక అనితకుమారి, నిర్మల, స్వరూప, లలిత, ఊర్మిల, భారతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కాపులకనపర్తి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లిబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పోషకాహార లోపం చిన్నారుల మానసిక ఎదుగుదలపై దుష్ప్రభావం చూపుతుందని చెప్పారు. రక్తహీనత రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యుడు రాజేందర్, పంచాయతీ కార్యదర్శి సునీత, యోగా శిక్షకులు రజిత, రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, ఆశ కార్యకర్తలు రజిత, పావని, తదితరులు పాల్గొన్నారు.

కేయూ వద్ద పీడీఎస్‌యూ నిరసన

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి మాట్లాడుతూ సమ్మె కారణంగా విద్యార్థులకు తరగతులు కొనసాగడం లేదని వాపోయారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ, రంజిత్‌కుమార్, కేయూ కార్యదర్శి పవన్‌కల్యాణ్, బాధ్యులు ముషారఫ్, ఆదిత్య, అరవింద్, ఠాగూర్, సాయిశంకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు





కామారం-పెంచికలపేట రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు

రాత్రివేళ పొంచి ఉన్న ప్రమాదం
● సూచిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు
● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఆత్మకూరు : మూల మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి.. మండలంలోని కామారం గ్రామం నుంచి పెంచికలపేటకు వెళ్లే రోడ్డులో అడుగడుగునా మృత్యు మలుపులుగా దర్శనమిస్తున్నాయి. 2 కిలోమీటర్ల పొడవులో ఆరు చోట్ల మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి వేళ ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డుగుండా మండల కేంద్రానికి జిల్లా కేంద్రానికి అనేక మంది ఆటోల్లో, ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటారు. అలాగే ప్రైవేటు పాఠశాలల బస్సులు సైతం ఈ మార్గంలో వెళ్తుంటాయి. వాహనాలు నడిపే వారు మూల మలుపులతో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.మూల మలుపులు ఉన్న చోట రేడియంతో తయారు చేసిన సూచికల బోర్డును ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవడంతో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. మూల ములపులు ఉన్న చోట అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం కూడా ఉందని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో రోడ్లపై ధాన్యం ఆరబోయడం పరిపాటిగా మారిపోయింది. మూల మలుపుల వద్ద పటిష్టమైన శాశ్వత ప్రాతిపదికలో చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



కామారం గ్రామం నుంచి పెంచికలపేటకు వెళ్లే రోడ్డులో అడుగడుగునా మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. రాత్రివేళ ఈ రోడ్డుపై వెళ్లడం ఇబ్బందిగా ఉంది. మూల మలుపుల వద్ద అధికారులు రేడియంతో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

\- పొగాకుల సంతోష్, వాహనదారుడు

వేసవిలో ఉపాధ్యాయుల పదోన్నతి చేపట్టాలి

● మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి దంపతులు



మల్లికార్జునస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి దంపతులు

ఐనవోలు : వేసవికాలంలోనే ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలని ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామిని ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. అనంతరం పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ శ్రీపాల్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఓపీఎస్ అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు పాతర్లపాటి రవీందర్, పురుషోత్తమ శర్మ, మధుశర్మ, శ్రీనివాస్, నరేష్, ఎంఈఓ పులి ఆనందం, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి, నాయకులు రాజు, చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, సూరిబాబు, మధుసూదన్ రెడ్డి, సమ్మయ్య, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, కిషన్ భవాని, రమేశ్, ప్రశాంత్, యాకయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి వసతి కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సాంబయ్య

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అంబులెన్స్ సేవలు అందజేస్తున్న సిబ్బందికి వసతి సౌకర్యం కల్పించాలని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వంగర సాంబయ్య సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ సులోచనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అంబులెన్స్ సేవలు అందజేస్తున్న డ్రైవర్, ఆరోగ్య సహాయకుడు ఎండకు ఉంటూ స్నానాలు, విశ్రాంతి, భోజనం ఇతర అవసరాలకు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఆస్పత్రి ఆవరణలోని వరండాలో పడిగాపులు కాయాల్సి వస్తోందని, రాత్రి వేళ వంట చేసుకొని భోజనం చేయాలంటే కోతుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అంబులెన్స్ సిబ్బందికి వెంటనే ఎంపీడీఓ కార్యాలయంలోని ఖాళీగా ఉన్న గదిలో వసతి కల్పించి అంబులెన్స్‌ను బస్టాండ్ దగ్గర నిలిపేల చూడాలని ఆయన కోరారు. ఆడెపు అశోక్ ఉన్నారు.

‘భూ భారతి’తో రైతులకు మేలు



భూ భారతి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ ప్రావీణ్య తదితరులు

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
● హర్షం వ్యక్తం చేసిన రైతులు



సమస్యను వివరిస్తున్న రైతు తిరుపతమ్మ

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నభూ భారతి చట్టం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం తహసీల్దార్ అధ్యక్షతన భూ భారతి పోర్టల్‌పై రైతులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిలుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. పరకాల ఆర్డీఓ నారాయణ రైతుల వేదికలో ఏర్పాటుల చేసిన స్క్రీన్ ద్వారా భూ భారతి పోర్టల్‌ను వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించడానికి ధరణి పోర్టల్‌లో లేని అవకాశాలు ప్రస్తుత భూ భారతి చట్టంలో ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు.అనంతరం రైతులకు భూ భారతి పోర్టల్‌పై ఏమైనా సమ్యస్యలు ఉన్నాయా అని అడుగగా మామిడి తిరుపతమ్మ మాట్లాడుతూ.. తనకు 8ఎకరాల భూమి ఉండగా కాస్తు చేస్తున్నానని, కానీ పట్టా లేదని తెలిపారు. కొందరు ఆ భూమి తమదంటూ కోర్టులో కేసు వేశారని వివరించారు. నా భర్త చనిపోయాడని ఇప్పటికైనా భూ భారతి పోర్టల్ ద్వారా భూమిని తనకు పట్టా చేసి ఇవ్వాలని ఆనంద బాష్పాలు కార్చారు. మాజీ ఎంపీటీసీ కొమ్ముల భాస్కర్, దుబాసి కృష్ణమూర్తిలు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ భూములు ఎన్నో అన్యాక్రాంతమయ్యాయని వివరించారు. ఇప్పటికైనా అక్రమంగా పట్టా చేసుకున్న వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని డ్వాక్రా సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్, సోలార్ ప్లాంట్‌కు, చిన్న తరహా పరిశ్రమలకు ఇవ్వాలని కోరారు. అనంతరం భూ భారతి చట్టం పోస్టర్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ ప్రావీణ్యలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిచంద్ర, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజేస్ అడ్వైజరీ మెంబర్ బాసాని చంద్రప్రకాశ్, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చల్లా చక్రపాణి, చింతల రవిపాల్, రవి, మార్కండేయ, కార్యకర్తలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్

పరకాల : వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు లేబర్ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని పరకాల పట్టణంలో అసిస్టెంట్ లేబర్ అధికారి జి.వినోద్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఎండల తీవ్రత దృష్ట్యా చలివేంద్రాలు చాలా అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీపతి, మంద రాజు, దుంపేటి రమేష్, దుప్పటి భరత్‌కుమార్, బొచ్చు కుమార్, మారెపల్లి సుధాకర్, బట్టు రవి పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్

హన్మకొండ : ఆత్మకూరు మండలం పెంచికలపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ ఓదెల లక్ష్మయ్యను సస్పెన్షన్ చేసినట్లు జిల్లా సహకార అధికారి బి.సంజీవ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో నిబంధనలు, మార్గదర్శకాలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు లక్ష్మయ్యను విధుల నుంచి సస్పెన్షన్ చేసినట్లు ఆయన వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ పాటించాలని, ప్రజాప్రతినిధులను, జిల్లా అధికారులను ఆహ్వానించాలని, రైతులకు కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని పీఏసీఎస్ సీఈఓలను ఆయన ఆదేశించారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



పశువుకు టీకా వేస్తున్న డాక్టర్ దీపిక

దామెర : పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి దీపిక రైతులకు సూచించారు. మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి సోకిన పశువుల్లో రోగనిరోధక శక్తి తగ్గుతుందని వివరించారు. తద్వారా పాల ఉత్పత్తి తగ్గడంతో పాటు పునరుత్పత్తి శక్తి తగ్గుతుందని పేర్కొన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతారని వెల్లడించారు. ఎండ తీవ్రత దృష్ట్యా పశువులకు ఉదయం పూట మేతకు తీసుకెళ్లాలని, చల్లటి నీరు అందించాలని సూచించారు. మూగజీవాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని రక్షించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ గంధం లక్ష్మణ్, జేవీఓ సారంగం, ఎల్ఎస్ఏ సిరాజుద్దీన్, శంకర్, సతీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు



పోలీసులు సీజ్ చేసిన టిప్పర్

దామెర : అనుమతి లేకుండా మొరం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కొంక అశోక్ హెచ్చరించారు. మండలంలోని పసరగొండ క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్‌ను పోలీసులు సోమవారం గుర్తించారు. డ్రైవర్‌ను విచారించగా పసరగొండ శివారు నుంచి మొరం తరలిస్తున్నట్లు అంగీకరించాడు. దీంతో టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా మొరం, మట్టి తవ్వకాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘ఓర్వలేకనే కడియంపై విమర్శలు’



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గానికి రూ.800 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని అభివృద్ధిని కడియం శ్రీహరి కేవలం 15 నెలల్లోనే చేశాడని వెల్లడించారు. దేవునూర్‌లో అటవీ భూముల కబ్జాపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి విసిరిన సవాల్‌ను బీఆర్ఎస్ నాయకులు ఇప్పటి వరకు స్వీకరించకుండా వ్యక్తిగత విమర్శలు చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు తన వ్యాఖ్యలను వక్రీకరించి మాట్లాడుతున్నారని, తనపై ఇప్పటికి అనేక అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు పిన్నింటి తిరుపతి రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు రణధీర్ రెడ్డి, అక్కల శంకర్, రాజయ్య, ప్రశాంత్, సలీం మాలీక్, అరవింద్, శ్రీకాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఆత్మకూరు: నివాళులర్పిస్తున్న రాజు తదితరులు



పరకాల: పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు : కార్యకర్తల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన చరణ్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం చరణ్ చిత్రపటం వద్ద నివాళులర్పించి, రూ.8,500 ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కార్యకర్తలను కాపాడుకుంటానని చెప్పారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తనుగుల సందీప్, గ్రామ అధ్యక్షుడు బయ్య రాజు, నాయకులు క్రాంతి, రాజేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

పరకాల : పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డుకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త పసుల సాంబయ్య సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు.కాగా సాంబయ్య మృతదేహనికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు పసుల రమేష్, ఏకు రాజు, కొయ్యడ చందం, రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



ధర్మసాగర్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య



దామెర: ఊరుగొండలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం సమీపంలో బీఆర్ఎస్ పార్టీ జెండా గద్దె నిర్మాణానికి సోమవారం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ పార్టీగా ఆవిర్భవించి.. 60 లక్షల సభ్యత్వంతో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ దూసుకు పోతోందని తెలిపారు. 25వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి దాదాపు 5 వేల మంది హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు బొడ్డు ప్రభుదాస్, లాల్‌మహ్మద్, మెరుగు రాజిరెడ్డి, మేకల విజయ్ కుమార్, చాడ కుమార్, దంతూరి బాలరాజు, మధు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నడికూడ : ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని నార్లాపూర్ గ్రామంలో రజక సంఘాల సమితి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చందు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

దామెర : ఎల్కతుర్తి వద్ద ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మాజీ సర్పంచ్ గోగుల సత్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఊరుగొండలో రజతోత్సవ బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను సోమవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో కేసీఆర్ సుపరిపాలన అందించారని వివరించారు. దేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కూనాటి సునీల్ రెడ్డి, పైండ్ల శ్రీను, జన్ను వినయ్, రమేశ్, కమలాకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



నడికూడ: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : ఈనెల 27న ఎల్కతుర్తి మండలంలోని చింతపల్లి సమీపంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మండల సురేందర్ నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వంగ రవీందర్, మాడిశెట్టి కుమారస్వామి, శ్రీనివాస్, కండె సుధాకర్, భిక్షపతి, అశోక్, వినయ్, రాజు, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు శ్రద్ధ తీసుకోవాలి



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఎల్కతుర్తి : బాలికల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హోమియోపతి వైద్యురాలు సరిత సూచించారు. సోమవారం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ శివారులో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో యోగా, న్యూట్రిషన్, పోషణ్ పక్వాడ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా బరువు తక్కువగా ఉన్న బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఎస్ఓ జ్యోతి తెలిపారు. అనంతరం విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు.కార్యక్రమంలో పీఈటీ శారద, యోగా శిక్షకులు రవళి, చంటి, సురేష్, హోమియో సిబ్బంది శ్రీనివాస్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.